

ఏఐజీ ఆస్పత్రిలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని పరామర్శించిన కేటీఆర్

ఎల్బీనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్వల్ప అస్వస్థతకు గురైన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నానక్‌రాంగూడలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు బుధవారం ఏఐజీ ఆస్పత్రికి చేరుకుని సుధీర్‌రెడ్డిని పరామర్శించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి సుధీర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సుధీర్‌రెడ్డి సతీమణి కమలాసుధీర్‌రెడ్డికి కేటీఆర్ ధైర్యం చెప్పారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ ఖానాపురం నియోజకవర్గం ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్, తదితరులున్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలి: లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా నాణ్యతతో చేపట్టాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని ఆంధ్రకేసరినగర్‌లో జరుగుతున్న రోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో జరుగుతున్న పనుల్లో కాలనీవాసులు భాగస్వాములై నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులు జరిగేవిధంగా తగు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రవిశంకర్, శ్రీనివాసులు, వెంకటేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

సీసీ రోడ్డు పనులను..

చంపాపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లోని మాధవనగర్‌కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.9లక్షలతో కొనసాగుతున్న ఇంటర్నల్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్లను వాల్ టూ వాల్‌గా వేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, కాలనీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు మణిపాల్‌రెడ్డి, అనసూయ, శంబుప్రసాద్, మోహన్‌రెడ్డి, ముత్యాలు, జంగయ్య, కోదండ రామారావు, పాండయ్య, పర్వత్‌రెడ్డి, నాయకులు దశరథ్‌గౌడ్ పాల్గొన్నారు.



బోనాల వేడుకల్లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్ సుజాతానాయక్

బోనాల వేడుకల్లో కార్పొరేటర్

చంపాపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాతానాయక్ బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పోచమ్మతల్లి బోనాల వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి కార్పొరేటర్ పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించారు.



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

సరూర్‌నగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందనవనం బస్తీలో అక్షయ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఎల్బీనగర్ డీసీపీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ హాజరై విద్యార్థులకు వాటిని అందజేశారు. సుమారు 40 మందికి ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేయడానికి ముందుకొచ్చిన అక్షయ ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు, ఎస్ఐ రాజశేఖర్, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



కవాడిపల్లిలో ప్రతిష్ఠించిన పీర్లు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 17(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గ్రామాల్లో మొహర్రం వేడుకలను కులమతాలకు అతీతంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లకు దట్టీలతో పాటు కుడుక, బెల్లం, ఊదు సమర్పించారు. 9రోజుల పాటు ప్రతిష్ఠించిన పీర్లను బుధవారం గ్రామంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం నిమజ్జనం చేశారు.



అష్టలక్ష్మి ఆలయంలో లక్ష తులసీ పూజలో ఆలయ కమిటీ ప్రతినిధులు



లక్ష తులసి పూజలో పాల్గొన్న భక్తులు



అష్టలక్ష్మి ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

- ఆలయాల్లో లక్ష పుష్పార్చనలు

చాదర్‌ఘాట్, జూలై 17(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి వేడుకలను బుధవారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలోని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సీతారామాంజనేయస్వామి, సంతోషిమాత ఆలయంలో, కనకదుర్గా ఆలయంలో, మూసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి, అమ్మవార్లకు లక్ష పుష్పార్చన పూజా కార్యక్రమాలు భక్తులతో కలిసి ఘనంగా నిర్వహించారు. సీతారామాంజనేయస్వామి, సంతోషిమాత ఆలయంలో ఉదయం స్వామివారికి, అమ్మవారికి అభిషేకం, మహా మంగళహారతి, సువర్ణ పుష్పార్చన, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, లక్ష పుష్పార్చన, మధ్యాహ్నం మహా మంగళహారతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా మూసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు లక్షపుష్పార్చన అత్యంత వైభవోపేతంగా నిర్వహించగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని కనకదుర్గా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని భక్తులతో ఘనంగా జరిపించారు. ఈవో సత్యనారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో..

ఎల్బీనగర్ : తొలి ఏకాదశిని పురస్కరించుకుని కొత్తపేట వాసవీకాలనీలోని అష్టలక్ష్మి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు అష్టలక్ష్మి అమ్మవార్లను భక్తితో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష తులసీ పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మరిగంటి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరీశెట్టి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, వైస్ చైర్మన్ నాగమల్ల శ్రవణ్‌కుమార్, కమిటీ సభ్యులు చిలుకా ఉపేందర్‌రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, ఉమాపతి, మాలే శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్నేహపురికాలనీలో..

కొత్తపేట: కొత్తపేట డివిజన్‌లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్నేహపురికాలనీలో గోదాసమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుండే ఆలయంలో పద్మావతీ, గోదాదేవి అమ్మవార్లకు, వేంకటేశ్వరస్వామికి వేద మంత్రాలతో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్నేహపురి, పరిసర కాలనీల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయ ప్రాంగణంలోని విజయవినాయకస్వామికి, ప్రసన్నాంజనేయస్వామికి, అయ్యప్పస్వామికి, కాశీ విశ్వేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలూ చేయించారు. భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. మోహన్‌నగర్ ఎస్‌బీహెచ్‌కాలనీలో గల పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, సత్యానగర్‌లోని హరిహర క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లలో..

సరూర్‌నగర్: తొలి ఏకాదశిని మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ల పరిధిలోని గ్రామాలు, కాలనీలు, బస్తీల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని వైష్ణవ ఆలయాలతో పాటు ఇతర దేవాలయాలు సైతం తెల్లవారుజాము నుంచే భక్తులతో సందడిగా మారాయి. మీర్‌పేట్‌లోని శివసాయినగర్‌కాలనీలో గల గౌరీ నీలకంఠేశ్వరసమేత లక్ష్మీగణపతి ఆలయంలో విష్ణు సహస్ర నామ స్తోత్రం, ద్వాదశావృత్తి పారాయణం నిర్వహించారు. ఇతర ఆలయాల్లోనూ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

హయత్‌నగర్, తుర్కయంజాల్‌లో..

హయత్‌నగర్: తొలి ఏకాదశిని పురస్కరించుకుని హయత్‌నగర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. హిందువులకు మొదటి పండగ కావడంతో సంవత్సరం మొత్తం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ వారి ఇష్ట దైవాలను దర్శనం చేసుకున్నారు. తుర్కయంజాల్ ఏవీనగర్‌లోని భూనీలా సమేత ఆది వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అదేవిధంగా ఇంజాపూర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి వేలాదిగా భక్తులు హాజరయ్యారు. కొహెడా, తొర్రూర్, బ్రాహ్మణపల్లి గ్రామాలలోని ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి.



దిల్‌సుఖ్‌నగర్‌లోని కనకదుర్గకు లక్షపుష్పార్చన



దిల్‌సుఖ్‌నగర్‌లోని సీతారామాంజనేయస్వామి, సంతోషిమాత ఆలయంలో లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు



మూసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామికి లక్షపుష్పార్చన చేస్తున్న భక్తులు



స్నేహపురి వేంకటేశ్వరాలయంలో స్వామివార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- తెలంగాణ పీడీ అండ్ పీఈటీల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

ఎల్బీనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైనవారందరికీ పదోన్నతులు ఇచ్చి మాట నిలబెట్టుకున్నదని తెలంగాణ పీడీ అండ్ పీఈటీల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. పీడీ, పీఈటీల పదోన్నతుల సాధనలో కీలకంగా నిలిచిన గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిని తెలంగాణ పీడీ అండ్ పీఈటీల సంఘం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో బుధవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలు కూడా త్వరలోనే పరిష్కారమయ్యే విధంగా చొరవ తీసుకుంటానన్నారు. ప్రతి ప్రభుత్వ బడిలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఖచ్చితంగా ఉండేలా ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం పాఠశాల బడ్జెట్‌లో ఆట వస్తువుల కోసం అధిక మొత్తంలో నిధులు కేటాయించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలుకు కృషి చేస్తానన్నారు. రాబోయే కాలంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఒక సబ్జెక్టుగా చేర్చి అర్హత గల పీడీలకు జూనియర్ కళాశాలలో అవకాశం ఇచ్చేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిని తెలంగాణ పీడీ అండ్ పీఈటీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బాబయ్య, ప్రధాన కార్యదర్శి మహ్మద్ సాబెర్, కోశాధికారి బసవరాజు, ప్రతాప్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దేవదాస్, విద్యాసాగర్, చంద్రమోహన్, అంజనేయులు, రామచంద్రుడు, నర్సింహులు, తిరుపతి, మహిపాల్, మల్లేష్, ఆనంద్, శంకర్, అబ్దుల్లా, స్వాములు, రాథోడ్, భాస్కర్, దశరథ్, వెంకటేశ్వర్లు, కృష్ణ, చారి, అంజనేయులు, సతీష్, భాస్కర్ పాల్గొన్నారు.



హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

సెయిలింగ్‌లో అష్రఫ్, అఖిలకు స్వర్ణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): తెలంగాణ మాన్‌సూన్ రెగెట్టా పోటీల్లో హాఫ్ రిగ్ ఫ్లీట్‌లో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అష్రఫ్, కొప్పుల అఖిల స్వర్ణ పతకాలు సాధించారు. బుధవారం హుస్సేన్ సాగర్‌లో జరిగిన ఈ పోటీల్లో అష్రఫ్ స్వర్ణం నెగ్గగా, నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలకు చెందిన యువరాజ్ రజతం, ఉద్భవ్ స్కూల్‌కు చెందిన పార్థు కాంస్యం గెలిచారు. బాలికల హాఫ్ రిగ్ ఫ్లీట్‌లో అఖిల స్వర్ణం సాధించగా, ముషీరాబాద్‌కు చెందిన నిఖిత రజతంతో మెరిసింది.



సెయిలర్ అష్రఫ్

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవల కారణంగా భార్యాపిల్లలకు దూరమై తాగుడికి బానిసైన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన అమ్ముగూడ రైల్వే స్టేషన్ మార్గమధ్యంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరికి చెందిన సుధాకర్ (44) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబ గొడవల కారణంగా భార్యాపిల్లలకు దూరంగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది మద్యానికి బానిసైన సుధాకర్ బుధవారం అమ్ముగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.



సుధాకర్ (ఫైల్)

రేపు మీర్‌పేట్ డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస పరీక్ష

- నెగ్గడానికి కావాల్సిన మెజారిటీ 31
- బీజేపీకి 21, కాంగ్రెస్‌కు 11 మంది సభ్యుల బలం
- అందరూ ఏకమైతేనే సక్సెస్.. లేకుంటే ఫెయిల్..!
- కాంగ్రెస్ సభ్యుల్లో ముగ్గురు 'చేయి'చ్చే ఛాన్స్..?

సరూర్‌నగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లో బీఆర్ఎస్‌కు చెందిన డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై శుక్రవారం ఉదయం 11గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. కందుకూరు ఆర్డీవో ఆధ్వర్యంలో జరుగనున్న ఈ సమావేశంలో మెజారిటీ సభ్యుల అభిప్రాయం ఆధారంగా అవిశ్వాస పరీక్ష ఫలితం తేలనుంది. మొత్తం 46 మంది సభ్యులు ఉన్న మీర్‌పేట్‌లో అవిశ్వాసం నెగ్గడానికి 31మంది సభ్యులు అవసరం. ప్రస్తుతం బీఆర్ఎస్ బలం కేవలం 14కాగా, మిగతా వారిలో 21మంది బీజేపీ సభ్యులు, 11 మంది కాంగ్రెస్ సభ్యులు ఉన్నారు. ఆ రెండు పార్టీలూ కలిస్తేనే అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉంది. వారిలో ఏ ఒక్కరు 'చేయి'చ్చినా అవిశ్వాసం వీగిపోయే ఛాన్స్ ఉంది. బీజేపీ సభ్యులంతా ఏకతాటిపై ఉన్నప్పటికీ కాంగ్రెస్ సభ్యుల్లోనే ఇద్దరు, ముగ్గురు అటూ ఇటూగా ఉన్నట్టు తెలుస్తోంది.

మేయర్‌పై వీగిన అవిశ్వాసం.. 'డిప్యూటీ'పై నెగ్గేనా..!?

గత మార్చిలో మీర్‌పేట్ మేయర్ దుర్గాదీప్‌లాల్(బీఆర్ఎస్) మీద సైతం బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు కలిసి అవిశ్వాసం ప్రకటించారు. ఈ క్రమంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా.. 29 మంది సభ్యులు మాత్రమే హాజరుకావడంతో కోరమ్ లేక అవిశ్వాసం వీగిపోయినట్టుగా రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. అప్పట్లో అవిశ్వాసం నెగ్గితే మేయర్ అభ్యర్థిగా బీజేపీకి చెందిన నీలారవినాయక్‌ను ప్రకటించారు. అయితే అవిశ్వాసం వీగడంతో ఆమె ఆశలు గల్లంతయ్యాయి. దాంతో ఆమెకు కనీసం డిప్యూటీ మేయర్ పదవి అయినా దక్కేలా చూడాలనే ఉద్దేశంతో తాజాగా విక్రమ్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రకటించారు. అయితే తమకు డిప్యూటీ ఇస్తేనే మద్దతు తెలుపుతామని, లేకపోతే సమావేశానికి రాబోమని కాంగ్రెస్‌కు చెందిన కొందరు సభ్యులు పేర్కొంటున్నట్టు తెలిసింది. దాంతో బీజేపీ సభ్యులు, పార్టీ నాయకులు డైలమాలో పడిపోయారు. 'ముందు అవిశ్వాసం నెగ్గనివ్వండి.. పదవి ఎవరు తీసుకోవాలో తర్వాత నిర్ణయం తీసుకుందాం'.. అని ఇరు పార్టీలకు చెందిన ముఖ్య నేతలు సర్ది చెప్పినట్టు తెలిసింది. బుధవారం మధ్యాహ్నం బీజేపీకి చెందిన సభ్యులు బాలాపూర్‌లోని ఓ బీజేపీ నాయకుడి ఇంటి వద్ద నుంచి క్యాంపుకు తరలినట్టు సమాచారం. మరోపక్క కాంగ్రెస్ సభ్యులు సైతం వేరుగా క్యాంపు పెట్టినట్టు తెలిసింది. ఇక బీఆర్ఎస్ సభ్యులతోనూ ఆ పార్టీ నేతలు క్యాంపు ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్‌లో నుంచి ఇద్దరు సభ్యులు వస్తే అవిశ్వాసానికి తిరుగుండదని భావిస్తున్న బీజేపీ నేతలు ఆ దిశలో ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. మరోపక్క కాంగ్రెస్ నుంచి ఇద్దరు, ముగ్గురు సభ్యులు 'దుమ్మా' కొట్టేలా బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ఇరువర్గాలు పట్టువీడకుండా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ మెజారిటీ సభ్యులు ఎటు మొగ్గు చూపుతారన్నది చర్చనీయాంశంగా మారింది. మొత్తం మీద శుక్రవారం ఉదయం 11గంటలకు కౌన్సిల్ హాల్‌లో జరుగనున్న అవిశ్వాస పరీక్ష సమావేశంలో ఏం జరుగుతుందన్నది వేచి చూడక తప్పదు..!



మీర్‌పేట్ మునిసిపల్ కార్యాలయం



ఆదిభట్ల పోలీసుల సమక్షంలో రమేశ్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న గిరి

మతి స్థిమితం లేని వ్యక్తిని చేరదీసి..
ఐదేళ్ల తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగింత

సరూర్‌నగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం మతి స్థిమితం సరిగా లేక రోడ్లపై తిరుగుతున్న ఓ అభాగ్యుడిని బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని మాతృ దేవోభవ అనాథాశ్రమం నిర్వాహకుడు గట్టు గిరి చేరదీసి ఆశ్రయం కల్పించారు. తన పేరు విఠల్ అని మాత్రమే చెప్పిన అతడికి ఐదేళ్లుగా సపర్యలు చేసి, వైద్యం చేయించి మామూలు మనిషిగా మార్చారు. తాజాగా తన పేరు రమేశ్ అని, వరంగల్ జిల్లా ఏటూరునాగారం మండలంలోని శివపురం తమ ఊరు అని చెప్పడంతో గట్టు గిరి వారికి సమాచారం అందించారు. ఈ క్రమంలో బుధవారం రమేశ్ కుటుంబ సభ్యులు ఆశ్రమానికి రాగా, ఆదిభట్ల పోలీసుల సమక్షంలో ఆయనను వారికి అప్పగించారు. ఈ సందర్భంగా రమేశ్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తాము రమేశ్ కోసం వెతకని చోటు లేదని, ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో చనిపోయి ఉంటాడని భావించామని, ఇప్పుడు మళ్లీ మాకు మామూలు వ్యక్తిగా దొరకడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఆశ్రమం నిర్వాహకుడు గిరికి జీవితాంతం రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు.



వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులను అభినందిస్తున్న సీపీ సుధీర్‌బాబు

ప్రమాదంలో ఉన్న వ్యక్తి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ పోలీసులు

- అభినందించిన రాచకొండ సీపీ

హైదరాబాద్ సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): ముగ్గురు పిల్లలతో కలిసి ప్రమాదంలో ఉన్న వ్యక్తిని సకాలంలో స్పందించి పోలీసులు కాపాడి ప్రాణాలు రక్షించారు. విధి నిర్వహణలో సమయస్ఫూర్తితో వ్యవహరించిన పోలీసులను రాచకొండ సీపీ సుధీర్‌బాబు బుధవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో అభినందించి రివార్డులు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల-15న మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెలగూడ ఆర్‌సీఐ రోడ్డు వద్ద కర్మాన్‌ఘాట్ వెళ్తున్న వెంకటేశ్ అనే వ్యక్తి తన మహేంద్ర ఎక్స్‌యూవీ కారులో ఏసీ నుండి అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. దాంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న వనస్థలిపురం ట్రాఫిక్ సిబ్బంది నర్సింగ్‌రావు, కృష్ణ, సాయిరామ్‌లు కారు నడుపుతున్న వ్యక్తిని అప్రమత్తం చేసి, కారు ఆపి అతని ప్రాణాలు కాపాడారు. మంటలు ఎక్కువగా రావడంతో అటువైపు వాహనాలు వెళ్లకుండా ఆపడంతో ఎవరికి ప్రాణనష్టం జరగలేదు. వెంటనే ఫైర్ సిబ్బందికి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చి, ఆలస్యం చేయకుండా, వాటర్ ట్యాంకర్‌తో మంటలు అదుపులోకి తీసుకుని రావడానికి కృషి చేశారు. తక్షణమే స్పందించి, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా వ్యవహరించిన ట్రాఫిక్ సిబ్బంది సమయస్ఫూర్తిని సీపీ అభినందించారు. విధి నిర్వహణలో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

బరాత్‌లో.. కత్తితిప్పిన యువకుడు

- అరెస్ట్ చేసిన సంతోష్‌నగర్ పోలీసులు

సంతోష్‌నగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): పెళ్లి బరాత్‌లో మారణాయుధంతో డ్యాన్స్ చేసిన ఓ వ్యక్తిని సంతోష్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్‌లోని దర్గా బరానే షా ప్రాంతానికి చెందిన అబ్దుల్ రహీం(42) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 5న రాత్రి 9గంటలకు సంతోష్‌నగర్ నయారా పెట్రోల్ బంక్ రాజీవ్‌నగర్ లేన్లో బంధువుల పెళ్లి బరాత్‌లో కత్తి(తల్వార్) తిప్పుతూ డ్యాన్స్ చేశాడు. దాంతో వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో విషయం తెలుసుకున్న సంతోష్‌నగర్ ఎస్ఐ పి.రవి కేసు నమోదు చేశారు. సిబ్బందితో వెళ్లి అబ్దుల్ రహీంను బుధవారం అరెస్ట్ చేసి కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితున్ని రిమాండుకు తరలించారు.